www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273
1వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక
| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 57 | | 6-8-2026 | | గురువారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/-



## జార్ఖండ్ నిరుద్యోగులకు సీజేపీ మద్దతు

జార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఆందోళన చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు సీజేపీ మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి విద్యార్థుల ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు.

4

## ఎట్టకేలకు దిగివచ్చిన మెటా



- ప్రధాని మోడీకి జుకర్ బర్గ్ క్షమాపణలు
- కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం

4

## హర్మూజ్ తెరవకుంటే..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేదంటే తీవ్రమైన దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌తో తమ చర్చలు సానుకూలంగా సాగుతున్నా.. వాటిని ఆ దేశం బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు.



4

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి

తెలంగాణ-మహారాష్ట్ర మధ్య సమావేశం ఏర్పాటు చేయండి

జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

- చర్చల పక్రియ ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి పాటిల్ హామీ
- అటవీ పర్యావరణ అనుమతులపై భూపేంద్రయాదవ్‌తో చర్చ
- ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న



ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించి, రెండు రాష్ట్రాల మధ్య చర్చలకు వేదిక ఏర్పాటు చేయాలని కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలసి బుధవారం కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో కలిశారు. ప్రాజెక్టు ఎత్తును 148 మీటర్ల నుంచి 150-152 మీటర్లకు పెంచినా ముంపు ప్రభావం ఎక్కువగా ఉండదని, 50 శాతం ముంపు నదీగర్భంలోనే ఉంటుందని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం తెలిపిందని వివరించారు. ఎత్తు పెంచడం వల్ల గ్రావిటీ ద్వారా నీటిని తరలించవచ్చని, తద్వారా విద్యుత్ భారం తగ్గుతుందని పేర్కొంటూ, మహారాష్ట్రతో తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్.. మొదట సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో అధికారుల స్థాయి చర్చలు, ఆ తర్వాత నీటిపారుదల శాఖ మంత్రుల భేటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

వివరాలు 2వ పేజీలో..

- న్యూఢిల్లీ, ఆగస్టు 5



## 22ఏ భూముల పేరిట అర్హులకు అన్యాయం జరగదు

- కొత్తగా ఒక్క సెంటు భూమినీ నిషేధిత జాబితాలో చేర్చలేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ప్రభుత్వ భూములను కాపాడుతూనే భూహక్కుదారులకు న్యాయం చేయాలి
- 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశం

3

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేసే కుట్ర

- గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఏపీకి అనుకూల నిర్ణయాలు
- 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు

3



## హరీష్ రావు తప్పుడు ప్రచారం మానుకోవాలి

- తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ లేదు
- కాళేశ్వరం ముడుపుల లెక్కలు తేల్చాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్

.. వివరాలు 3లో



## హైదరాబాద్‌తో పాటు 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్

- క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో మరో మూడు రోజులు వర్షాలు
- కామారెడ్డి, మేడ్చల్, మెదక్, సంగారెడ్డికి ఆరెంజ్ హెచ్చరిక



2

## ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

- జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు..
- తీర ప్రాంత ప్రజలకు అధికారుల హెచ్చరికలు
- సరిహద్దు కృష్ణ బ్రిడ్జి వద్ద ఆహ్లాదకర దృశ్యాలు



2

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటక పరివాహక ప్రాంతాల నుంచి భారీగా ప్రవాహం రావడంతో కృష్ణా, భీమా నదుల్లో వరద ఉధృతి గణనీయంగా పెరిగింది. గుర్జాపూర్ బ్యారేజీ తో పాటు యాదగిరి జిల్లా భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీలకు వరద నీరు పోటెత్తింది.

## డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్

- భారీ పెట్టుబడుల ఆకర్షణకు వేదిక కావాలి
- సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు సీఎస్ సంజయ్ ఆదేశం

డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

2






## డయల్ 112 సేవలు ప్రారంభం

- పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్
- సేవలను ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్

3

## హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ

- నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ
- 8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం

2






# హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

**నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ**

**8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం**

**హైదరాబాద్, ఆగస్ట్ 5:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఫ్లై÷ర్ ఎన్వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అ÷-జబెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు. ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

**జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు..**

**తీర ప్రాంత ప్రజలకు అధికారుల హెచ్చరికలు**



**నారాయణపేట, ఆగస్ట్ 5:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కృష్ణ నదిపై నిర్మించిన గుర్జాపూర్, యాదగిరి జిల్లా గూడూరు భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీకి వరద నీరు పోటెత్తడంతో ఈ బ్యారేజీ 40 గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద జలాలు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు కు చేరుతుండటంతో నది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. నది పూర్తిగా నీటితో నిండిపోవడంతో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కృష్ణ బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వరద ప్రవాహం ఆహ్లాదకర దృశ్యాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులతో పాటు ప్రయాణికులు కూడా బ్రిడ్జి వద్దకు చేరుకుని ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. కృష్ణానదిలో ప్రవాహం రోజురోజుకు వరద ప్రవాహం పెరుగుతుండడంతో జూరాల ప్రాజెక్టు అధికారులు ఎప్పటి కప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరద ఉధృతి కారణంగా నదిలో స్నానాలు చేయకుండా, చేపల వేటకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# హైదరాబాద్‌తో పాటు 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్

**హైదరాబాద్, ఆగస్టు 5:** రాష్ట్రవ్యాప్తంగా క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్, నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. కామారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమురం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నల్లగొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో 11.56 నుంచి 20.44 సెంటీమీటర్ల మధ్య భారీ వర్షపాతం నమోదైంది. మరో 40 మండలాల్లో 6.45 నుంచి 11.55 సెంటీమీటర్ల మధ్య, 281 మండలాల్లో 1.56 నుంచి 6.44 సెంటీమీటర్ల మధ్య వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో అత్యధికంగా కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలో 14.11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం పేర్కొంది. ప్రజలు వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి

- తెలంగాణ-మహారాష్ట్ర మధ్య సమావేశం ఏర్పాటు చేయండి
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి
- చర్చల పక్రియ ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి పాటిల్
- అటవీ పర్యావరణ అనుమతలుపై భూపేంద్రయాదవ్‌తో చర్చ
- ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రాణహిత నదిపై ప్రతిపాదిత తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఈ అంశంపై తెలంగాణ, మహారాష్ట్రల మధ్య త్వరితగతిన సమావేశం ఏర్పాటు చేసి చర్చలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం న్యూఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిసి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానిపై ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్‌శక్తి శాఖకు పంపిన లేఖను కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిందని, అయితే 150 నుంచి 152 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే గ్రావిటీ ద్వారా నీటి సరఫరా సాధ్యమవుతుందని సీఎం వివరించారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం ప్రకారం 148 మీటర్లు, 152 మీటర్ల ఎత్తుల్లో ముంపు ప్రభావంలో పెద్దగా తేడా లేదని, ముంపులో అధిక భాగం నదీగర్భంలోనే ఉంటుందని తెలిపారు. బ్యారేజీ ఎత్తు పెరిగితే ఎత్తిపోతల అవసరం తగ్గి విద్యుత్ వ్యయం కూడా ఆదా అవుతుందని, ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. ఈ అంశంపై స్పందించిన జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన లేఖ తమకు అందిందని తెలిపారు. తొలుత కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారులతో సమావేశం నిర్వహించి చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని, అనంతరం రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**పర్యావరణ అనుమతులపై భూపేందర్‌తో భేటీ**

కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో కూడా సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్, ఎస్ఆర్‌వీఎస్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ, అటవీ అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని రహదారులు, అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అనుమతుల అంశాన్ని కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**కిషన్ రెడ్డి వ్యాఖ్యలకు సీఎం కౌంటర్**

ఢిల్లీ పర్యటన సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారిపై తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. ప్రధాని దూషణలపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎన్ని కేసులు నమోదు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. డీఎస్పీ బదిలీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన విమర్శలను తిప్పికొడుతూ, అధికారుల బదిలీలు ప్రభుత్వం పరిధిలోని పరిపాలనా అంశమని స్పష్టం చేశారు. బీజేపీ నేతలూ ప్రత్యర్థులపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారని, కాక్రోచ్ జనతా పార్టీ, విద్యార్థులపై కూడా అవమానకర వ్యాఖ్యలు చేశారని విమర్శించారు.

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

- భారీ పెట్టుబడుల ఆకర్షణకు సమ్మిట్ వేదిక కావాలి
- సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 5:** డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైజింగ్--2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యం కీలకమని సంజయ్ జాజు పేర్కొన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి ఈ గ్లోబల్ సమ్మిట్ ప్రధాన వేదికగా నిలవాలని, అందుకు అన్ని శాఖలు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తెలంగాణను పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఆయన తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. సమ్మిట్‌కు అవసరమైన రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక వసతులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక వృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంచడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ భూముల పేరిట అర్హులకు అన్యాయం జరగదు

- కొత్తగా ఒక్క సెంటు భూమినీ నిషేధిత జాబితాలో చేర్చలేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ప్రభుత్వ భూములను కాపాడుతూనే భూహక్కుదారులకు న్యాయం చేయాలి
- 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశం



**హైదరాబాద్, ఆగస్ట్ 5:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్/రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్/రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు. ÷-రజావాణిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశిరచిన 45 రోజుల గడువులోనే అన్ని పక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 22ఏ కు సంబంధించిన కేసులలో కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు ? ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

# ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేసే కుట్ర

- గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఏపీకి అనుకూల నిర్ణయాలు
- 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు




**హైదరాబాద్, ఆగస్టు 5:** తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు ఇప్పటికే లభించిన అనుమతులను పునఃసమీక్షించి రద్దు చేసే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) ఈ నెల 18న నిర్వహించనున్న సమావేశం ఎజెండాలో తెలంగాణ ప్రాజెక్టుల అంశాలు చేర్చడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అనుమతులు పొందిన కాళేశ్వరం, సీతారామ, సమ్మక్క సాగర్ సహా ఏడు ప్రాజెక్టుల అనుమతులను సమీక్షించాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, అదే అంశాన్ని జీఆర్ఎంబీ ఎజెండాలో చేర్చడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటికే అనుమతులు పొందిన ప్రాజెక్టులను రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. 18న జరిగే బోర్డు సమావేశానికి సంబంధించిన ఎజెండా విడుదలై వారం రోజులు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఆశ్చర్యకరమని హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణకు చెందిన ఇంజినీర్లు బోర్డులో ఉన్నప్పటికీ ఈ అంశం ఎజెండాలోకి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఒకవేళ ప్రభుత్వం ముందుగానే తెలుసుకుని కూడా స్పందించకపోతే అది మరింత ఆందోళనకరమని అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు తర్వాత గోదావరి జలాల్లో రాష్ట్రానికి 383 టీఎంసీల వినియోగానికి అవసరమైన అనుమతులు బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిందని గుర్తు చేసిన ఆయన, ఇప్పుడు వాటినే రద్దు చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని, పైగా ఇప్పటికే పొందిన అనుమతులు కూడా ప్రమాదంలో పడుతున్నాయని విమర్శించారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు 2022లో సాధించిన అనుమతులను కూడా రద్దు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నీరు హుజూ-ర్‌నగర్ ప్రాంతానికి ఉపయోగపడుతుందని, అయినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన తర్వాతే ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం తమ విమర్శలకు నిదర్శనమని అన్నారు. గోదావరి-బనకచర్ల అంశంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం లోపాయికారీ ఒప్పందాలతో వ్యవహరిస్తోందని ఆరోపించిన హరీశ్‌రావు, తెలంగాణకు చట్టబద్ధంగా ఉన్న 960 టీఎంసీల గోదావరి జలాల హక్కులను ప్రభుత్వం సమర్థంగా కాపాడలేకపోతోందన్నారు. కృష్ణా జలాల వినియోగంలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏడు అనుమతులను సమీక్షించే ప్రతిపాదనపై బీజేపీ నేతలు కూడా స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్న ఆయన, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని జీఆర్ఎంబీ ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంపీలు కూడా పార్లమెంట్‌లో ఈ అంశాన్ని బలంగా లేవనెత్తాలని కోరారు. తెలంగాణ నీటి హక్కులకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా రాష్ట్ర ప్రజలు సహించరని హెచ్చరించిన హరీశ్‌రావు, కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయడం అంటే సగం తెలంగాణ రైతాంగానికి అన్యాయం చేయడమేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# హరీష్ రావు తప్పుడు ప్రచారం మానుకోవాలి

- నీటి హక్కుల విషయంలో రాజీ లేదు
- కాళేశ్వరం ముడుపుల లెక్కలు తేల్చాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్



**హైదరాబాద్, ఆగస్టు 5 :** ఏపీ ప్రభుత్వం గత పన్నెండేళ్లుగా ప్రతి బోర్డు సమావేశంలో తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూనే ఉందని, ఇందులో కొత్తేమీ లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఏపీ ప్రాజెక్టులకు పరోక్షంగా సహకరించిన బీఆర్ఎస్ నాయకులు, అధికారం కోల్పోయాక ప్రభుత్వంపై నిరాధారమైన నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైతాంగ నీటి ప్రయోజనాలను కాపాడే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని తేల్చి చెప్పారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర హక్కులను ఏనాడూ కాపాడలేదని, రాయలసీమ ఎత్తిపోతల పథకం, పోలవరం-బనకచర్ల, పట్టిసీమ ప్రాజెక్టుల నిర్మాణాలు వారి హయాంలోనే జరిగాయని మంత్రి గుర్తుచేశారు. ఈ నెల 18న జరగనున్న జీఆర్ఎంబీ సమావేశ అజెండాలోని అంశాలన్నీ పాతవేనని, గతంలో కూడా ఏపీ ప్రభుత్వం సీతారామ, సమ్మక్క, చిన్న కాళేశ్వరం వంటి ఏడు ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నం చేసిందని తెలిపారు. అయితే తమ ప్రభుత్వం సీడబ్ల్యూసీ, జీఆర్ఎంబీల వద్ద దీటుగా స్పందించి, సుదీర్ఘ పోరాటం ద్వారా సీతమ్మ సాగర్-సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు విజయవంతంగా టీఏసీ క్లియరెన్స్ సాధించిందని వివరించారు. అలాగే సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఎన్‌వోసీ కోసం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రితో మాట్లాడామని, ఈ నెలాఖరులోగా నిరభ్యంతర పత్రం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఏపీ ప్రతిపాదించిన కృష్ణా వాటా ట్రిబ్యునల్ ఏర్పాటు అడ్డుకోవడంలో తమ ప్రభుత్వం సమయస్ఫూర్తిగా వ్యవహరించిందని స్పష్టం చేశారు. పోతిరెడ్డిపాడు, ఇతర అంశాలపై సీఎం, నీటిపారుదల శాఖ, అధికారులు నిరంతరం కేంద్ర ప్రభుత్వంతో, బోర్డులతో సంప్రదింపులు జరుపుతున్నారని, సుప్రీంకోర్టులో ఒరిజినల్ సూట్ దాఖలు చేసి న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఏపీ కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు అందాయని సొంత చెల్లెలు కవిత చేసిన ఆరోపణలపై హరీష్‌రావు ముందుగా సమాధానం చెప్పాలని, లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరాన్ని కూల్చివేసే స్థితికి తెచ్చిన బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని దుయ్యబట్టారు.

# డయల్ 112 సేవలు ప్రారంభం

**పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్**

**సేవలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్**

**హైదరాబాద్,ఆగస్ట్5 :** తెలంగాణలో డయల్ 112 సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టిజిఐసిసి నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ ఆల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్డ్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు. యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జివికె వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.






# భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి నిర్మాణం

**పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 5:** భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం రెండో బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఒకే బ్రిడ్జి ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు వచ్చాయని ప్రస్తావించారు. భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పనుల గురించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడారు. అమరావతి టూ జగదల్‌పూర్ జాతీయ రహదారిని భద్రాచలం మీదుగా ప్లాన్ చేసి రెండో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ బ్రిడ్జి అప్రోచ్ వరద కోతకు గురవకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ నెలలో గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి ఈ బ్రిడ్జిని తీసుకువస్తామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయని అన్నారు. ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వయా భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఈ రెండో బ్రిడ్జి ఎంతో సౌకర్యంగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.



# విద్యార్థులకు వీసాలు పెంచాలి

**అమెరికా రాయబారి సెర్జియో గోర్‌ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే తెలంగాణ విద్యార్థులకు మరిన్ని వీసాలు మంజూరు చేయడంతో పాటు వీసా అపాయింట్‌మెంట్లు సకాలంలో లభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్‌ను కోరారు. బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా జరిగిన భేటీలో ఈ అంశాలతో పాటు విద్య, పెట్టుబడులు, సాంకేతికత, ఉపాధి, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించారు. సుమారు అరగంటకు పైగా సాగిన సమావేశంలో తెలంగాణ విద్యార్థులకు వీసా ఇంటర్వ్యూ స్లాట్లను పెంచాలని, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న తెలంగాణకు చెందిన నిపుణులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా రాయబారి దృష్టికి తీసుకెళ్లారు. హెచ్-1బీ వీసాల ప్రాసెసింగ్, రెన్యువల్, వీసా స్టాంపింగ్ ప్రక్రియను మరింత సరళీకరించాలని, వీసా నిబంధనల్లో మార్పులు జరిగే ముందు ముందస్తు సమాచారం అందించాలని కోరారు. అమెరికాలో చదువుతున్న తెలంగాణ విద్యార్థుల భద్రత, సంక్షేమంపై ప్రత్యేకంగా చర్చించిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలో అమెరికా కంపెనీలకు విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని వివరించారు. సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, జీవ విజ్ఞాన శాస్త్రాలు, ఔషధ పరిశ్రమ, స్టార్టప్‌లు, పరిశోధన, ఆధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. అమెరికా విశ్వవిద్యాలయాలు తెలంగాణ విద్యాసంస్థలతో కలిసి పరిశోధన, విద్యార్థుల మార్పిడి, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించేలా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. అమెరికాలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న భారతీయ భాషల్లో తెలుగు ఒకటని గుర్తు చేశారు. భారత చరిత్ర, సంస్కృతిపై అమెరికా రాయబారి సెర్జియో గోర్‌కు ఉన్న అవగాహన తనను ఆకట్టుకుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలు, రాష్ట్ర అభివృద్ధి అవకాశాలపై రాయబారి చూపిన ఆసక్తిని అభినందించారు. తెలంగాణ--అమెరికా మధ్య వ్యాపారం, పెట్టుబడులు, విద్య, సాంకేతిక సహకారం, సాంస్కృతిక మార్పిడి, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని అమెరికా రాయబారి సెర్జియో గోర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

# సీఎం రేవంత్ విదేశీ పర్యటన

**షరతులతో అనుమతిచ్చిన ఏసీబీ కోర్టు**

**హైదరాబాద్, ఆగస్ట్ 5:** సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్-పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్‌పోర్టులను తాత్కాలిక కస్టడీకి ఇవ్వడంతో పాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానని అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారికి లేఖ రాసి పాస్-పోర్టులను తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

# నేడు 'సామాజిక న్యాయ తెలంగాణ' సంకల్ప సభ

**సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో విస్తృత ఏర్పాట్లు**

**సామాజిక వైతాళికుల చిత్రపటాలతో సభా ప్రాంగణం సిద్ధం**

**హైదరాబాద్, ఆగస్టు 5:** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' గురువారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరగనుంది. సబ్బండ వర్గాల సాధికారత, సామాజిక న్యాయం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సభకు భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. సాధించుకున్న భౌగోళిక తెలంగాణను సామాజిక న్యాయ తెలంగాణగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా కొత్త రాజకీయ ఆలోచనలకు ఈ సభ వేదిక కానుందని పేర్కొన్నారు. సభా ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, తెలంగాణ భావజాల నిర్మాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్, మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, భాగ్యరెడ్డి వర్మ చిత్రపటాలను ఏర్పాటు చేశారు. అలాగే చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కాన్షీరామ్, కొమురం భీమ్, కొండా లక్ష్మణ్ బాపూజీ, కర్పూరి ఠాకూర్ చిత్రాలను కూడా ప్రదర్శనలో ఉంచుతున్నారు. అదేవిధంగా తొలి తరం తెలంగాణ ఉద్యమకారిణి టి.ఎన్. సదాలక్ష్మి, పండుగ సాయన్న, వడ్డెర ఓబన్న, సంత్ సేవాలాల్ మహరాజ్, సంగం లక్ష్మీబాయి, షోయబుల్లాఖాన్, మారోజు వీరన్న, మఖ్దూం మొహియుద్దీన్ వంటి సామాజిక, ఉద్యమ, స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రపటాలతో సభా ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సబ్బండ వర్గాల అభ్యున్నతి, సాధికారత అంశాలపై ఈ సంకల్ప సభలో కీలక తీర్మానాలు, భవిష్యత్ కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉన్నట్లు నిర్వాహక వర్గాలు వెల్లడించాయి.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



## సంపాదకీయం



# తెలంగాణ భావజాల వైతాళికుడు

**తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నానికి ప్రాణవాయువు అందించి, భావజాలాన్ని ప్రతి గుండెకూ వ్యాపింపజేసిన దిశానిర్దేశకుడు**

## నేడు ఆచార్య జయశంకర్ జయంతి

తెలంగాణ అనగానే ప్రతి ఒక్కరి మనోఫలకంపై మెదిలే రూపం, తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రతి అక్షరంలోనూ, ప్రతి మాటలోనూ ప్రతిధ్వనింపజేసిన సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్. "తెలంగాణ రాష్ట్ర సాధనే నా శ్వాస.. నా ధ్యాస.. నా అంతిమ లక్ష్యం" అని జీవితాంతం తపించి, తన జీవితాన్ని, జ్ఞానాన్ని పూర్తిగా మాతృభూమి విముక్తికే అంకితం చేసిన దార్శనికుడు ఆయన. ఆగస్టు 6న ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా, తెలంగాణ సమాజం ఆయన అమూల్యమైన సేవలను, ఉద్యమ ప్రస్థానాన్ని సగర్వంగా స్మరించుకుంటోంది.

**తొలినాటి చైతన్యం.. చిన్నతనంలోనే ఉద్యమ విత్తనం**

ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో 1934 ఆగస్టు 6న లక్ష్మీకాంతరావు, మహాలక్ష్మమ్మ దంపతులకు జన్మించిన జయశంకర్ గారు, బాల్యం నుంచే అన్యాయాలను సహించని తత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. 1952 నాటి నాన్-ముల్కీ ఉద్యమంలో పాఠశాల విద్యార్థిగానే చురుగ్గా పాల్గొన్నారు. ఆ తర్వాత విశాలాంధ్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ పాఠశాల రోజుల్లోనే నిరసన గళం విప్పారు. తెలంగాణ ప్రాంత భౌగోళిక, సాంస్కృతిక, ఆర్థిక స్వభావంపై ఆయనకు ఉన్న స్పష్టమైన అవగాహన, చిన్ననాటే ఆయనను ఉద్యమబాట వైపు నడిపించింది.

**విద్యారంగంలో అత్యున్నత శిఖరాలు.. ప్రాచార్యుడిగా చారిత్రాత్మక పాత్ర**

జయశంకర్ కేవలం ఉద్యమకారుడే కాదు, అరుదైన విద్యావేత్త మరియు ఆర్థికవేత్త. ఆలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ నుంచి ఆర్థికశాస్త్రంలో పిహెచ్‌డి పట్టా పొందిన ఆయన, అధ్యాపకుడిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించి, సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా, కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, చివరికి అదే విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా అత్యున్నత బాధ్యతలను నిర్వర్తించారు. కేంద్ర పాఠశాల విద్యారంగం బోర్డు సభ్యుడిగా కూడా ఆయన సేవలందించారు. విద్యావేత్తగా ఎన్నో శిఖరాలను అధిరోహించినప్పటికీ, ఆయన ఆలోచనలన్నీ నిరంతరం తెలంగాణ ప్రయోజనాల చుట్టూనే తిరిగేవి.

**గణాంకాలే ఆయుధాలుగా బహుజన జాగృతి**

ఉమ్మడి పాలనలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ఊహాగానాలతో కాకుండా, పక్కా గణాంకాలతో ససాక్ష్యంగా ప్రపంచం ముందుంచిన ఘనత జయశంకర్ గారికే దక్కుతుంది. నీటి కేటాయింపుల్లో వివక్ష, నిధుల మళ్లింపు, ఉద్యోగ నియామకాలలో ఉల్లంఘనలు వంటి అంశాలపై ఆయన విస్తృతమైన పరిశోధన చేశారు. ఆయన రాసిన "తెలంగాణ రాష్ట్రం - ఒక పరిశీలన" వంటి గ్రంథాలు మరియు వ్యాసాలు ఉద్యమానికి గ్రంథాలుగా మారాయి. పల్లె పల్లెనా పర్యటిస్తూ విద్యార్థులు, యువత, ఉద్యోగులను చైతన్యవంతం చేస్తూ, "మన నీళ్లు, మన నిధులు, మన నియామకాలు మనకే దక్కాలి" అనే మూల సూత్రాన్ని ప్రజాక్షేత్రంలోకి బలంగా తీసుకెళ్లారు.

**మలిదశ ఉద్యమానికి దిక్సూచి, సిద్ధాంతకర్త**

1969 తొలిదశ ఉద్యమం నీరసించిన తర్వాత, తెలంగాణ ఆకాంక్ష చల్లారిపోకుండా దశాబ్దాల పాటు నిలబెట్టిన ఘనత ఆయనదే. 1990ల కాలంలో తెలంగాణ ఐక్యవేదిక, తెలంగాణ మహాసభ వంటి అనేక వేదికల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. రాజకీయ వ్యూహాలు ఎలా ఉన్నప్పటికీ, ఉద్యమానికి కావలసిన స్పష్టతను నిరంతరం అందిస్తూ వచ్చారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో రాజకీయ రంగులకు అతీతంగా, సకల జనులను ఒకే వేదికపైకి తేడానికి ఆయన అందించిన మార్గదర్శకత్వం అపారమైనది. ఉద్యమ నాయకులకు, ప్రజాసంఘాలకు, విద్యార్థి లోకానికి ఆయన ప్రతిక్షణం దిక్సూచిగా నిలిచారు.

**నెరవేరిన ఆశయం.. చిరస్మరణీయ భావజాలం**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అవతరణను కళ్లజూడాలని చివరి క్షణం వరకు తపించినప్పటికీ, 2011 జూన్ 21న ఆయన కన్నుమూశారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ, ఆయన రగిల్చిన చైతన్య జ్వాలలే చివరికి స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేశాయి. ఈనాడు స్వపరిపాలనలో పురోగమిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి ఆనాడు ఆచార్య జయశంకర్ గారు వేసిన భావజాల పునాదే మూలాధారం. తెలంగాణ ఉన్నంత కాలం ఆచార్య జయశంకర్ సార్ జ్ఞాపకాలు, ఆయన చూపిన బాట ప్రతి తెలంగాణ బిడ్డకు అనునిత్యం స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.

# ఎట్టకేలకు దిగివచ్చిన మెటా

- ప్రధాని మోడీకి జుకర్ బర్గ్ క్షమాపణలు
- కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం







**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించింది. అంతే కాకుండా తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీకి క్షమాపణలు చెప్పింది. ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించిన వ్యవహారం మెటాకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడంతో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. అలాగే కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కూడా మెటా బృందం కలిసింది. జులై 23న ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన వీడియోను ఫేస్‌బుక్ కొంతసేపు పరిమితం చేసింది. అనంతరం అది సాంకేతిక లోపం వల్ల జరిగిందని మెటా వివరణ ఇచ్చి పోస్టును పునరుద్ధరించింది. అయితే ఈ వివరణను కేంద్ర ప్రభుత్వం సరిపోదని స్పష్టం చేసింది. సమావేశంలో ప్రధాని పోస్టు వ్యవహారంతో పాటు ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు, కృత్రిమ మేధతో రూపొందించిన తప్పుడు సమాచార నియంత్రణ వంటి అంశాలపై కూడా కేంద్రం ప్రశ్నలు సంధించింది. ప్రముఖ వ్యక్తుల ధృవీకరించిన ఖాతాల్లోని పోస్టులను తొలగించే ముందు మరింత భద్రతా వ్యవస్థ ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. మెటా అల్గోరిథమ్ ఎలా పనిచేస్తోంది? పోస్టులు ఏ ప్రాతిపదికన తొలగించబడుతున్నాయి? భారత చట్టాలకు అనుగుణంగా వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? వంటి అంశాలపై కూడా ప్రభుత్వం వివరణ కోరింది. దేశ భద్రత, ప్రజా శాంతి వంటి అంశాలకు సంబంధించిన విషయాల్లో సోషల్ మీడియా వేదికలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ వీడియో తొలగింపును తీవ్రంగా పరిగణించిన పార్లమెంటరీ స్థాయి సంఘం మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. నిర్దేశిత గడువులో స్పందించకపోతే భారతదేశంలో మెటాకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' రక్షణను పునఃపరిశీలించే అవకాశం ఉందని హెచ్చరించింది. సోషల్ మీడియా సంస్థలు భారత చట్టాలను పూర్తిగా పాటించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మెటా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం.

# హర్మూజ్ తెరవకుంటే అంతే సంగతులు

**మరోమారు ఇరాన్‌కు ట్రంప్ ఘాటు హెచ్చరిక**



**వాషింగ్టన్, ఆగస్ట్ 5:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేదంటే తీవ్రమైన దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌తో తమ చర్చలు సానుకూలంగా సాగుతున్నా.. వాటిని ఆ దేశం బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గితే పరిణామాలు అత్యంత తీవ్రంగా ఉంటాయని టెహ్రాన్‌ను హెచ్చరించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద దాడికి అమెరికా సిద్ధమవుతున్న సమయంలో ఇరాన్ తమను సంప్రదించి చర్చలకు రావాలని కోరిందని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. టెహ్రాన్ అణ్వాయుధాలు కలిగి ఉండేందుకు అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోదని అధ్యక్షుడు పునరుద్ఘాటించారు. హర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకలకు సంబంధించి ఇరాన్, ఒమన్‌తో కలిసి తాము చర్చలు జరుపుతున్నామని అగ్రరాజ్యం వెల్లడించింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. అయితే ఈ ప్రకటనను ఇరాన్ ఖండించింది. ఒమన్‌తో తాము జరుపుతున్న చర్చల్లో అమెరికా భాగస్వామ్యం ఏమాత్రం లేదని తెలిపింది. తమ సార్వభౌమాధికారాన్ని, భద్రతా ప్రయోజనాలను కాపాడే కొత్త సముద్ర రవాణా విధానాన్ని ఏర్పాటు చేయడంపైనే ఈ చర్చలు సాగుతున్నాయని పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు చేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏ మలుపు తిరుగుతాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# జార్ఖండ్ నిరుద్యోగులకు సీజేపీ మద్దతు

**అవసరమైతే రాంచీకి వెళ్లి ఆందోళనలో పాల్గొంటాం**

**రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదన్న అభిజిత్ దీప్కే**



**ముంబై, ఆగస్టు 5:** జార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఆందోళన చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి విద్యార్థుల ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, జూలై 29 నుంచి రాంచీలో కొనసాగుతున్న నిరవధిక నిరసనకు తమ పూర్తి సంఘీభావం ఉంటుందని తెలిపారు. జార్ఖండ్ నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లకు అండగా నిలుస్తామని, అవసరమైతే ఉద్యమంలో నేరుగా పాల్గొంటామని స్పష్టం చేశారు. సీజేపీ ప్రస్తుతం రాజకీయ పార్టీగా కాకుండా దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తోందని అభిజిత్ దీప్కే చెప్పారు. న్యాయవ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, మీడియా, ఎన్నికల సంఘం వంటి ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వాటిలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర ప్రభుత్వ నియామక పరీక్షల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌కు సీజేపీ మద్దతు ప్రకటించడంతో ఉద్యమానికి మరింత ఊతం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు

**నిరసనకారుల ఇళ్లపైకి గూండాలను పంపారు**

**మీడియా సమావేశంలో రాహుల్ ఆరోపణలు**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5:** నీట్ పేపర్ లీక్ వివాదంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద యువత నిరసనలు తెలిపారు. అయితే, విద్యార్థుల్ని బలప్రయోగం, బెదిరింపులతో కేంద్రం అణచివేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులతో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల ఇళ్లకు గుండాలను పంపించారని, 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనకారులు రాజ్యాంగ పరిరక్షకులని, కూప్పకూలుతున్న పనికిరాని విద్యా వ్యవస్థను ప్రశ్నిచడంలో ఎలాంటి తప్పు లేదని అన్నారు. నిరసనల్లో పాల్గొన్న వారి ఇళ్లకు గుండాలను పంపించారని, ఆ తర్వాత 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించి, ఆ క్షమాపణలు అంగీకరించారని, ఇది పూర్తిగా అర్థరహితం, దీనిని తాము అంగీకరించమని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని, వారిని వేధించారని ఆరోపించారు. దేశంలో పారదర్శకంగా పనిచేసే విద్యా వ్యవస్థ అవసరమని అన్నారు. విద్యార్థులు ఎలాంటి హింసకు పాల్పడలేదని, వారిపై లాఠీచార్జ్ చేయడం, వేధించడం సరికాదని అన్నారు. తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులపై గర్వంగా ఉందని పేర్కొన్నారు.

# జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

**వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి**

**డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ నివాళి**



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** జమ్మూకశ్మీర్, లద్దాఖ్ సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయనకు నివాళులర్పించిన ప్రధాని మోదీ, ఆర్టికల్ 370, 35(ఏ) రద్దుతో జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. విద్య, వైద్యం, క్రీడలు, పారిశ్రామిక రంగాల్లో కొత్త అవకాశాలు సృష్టిస్తున్నామని వెల్లడించారు. మహిళలు, అణగారిన వర్గాలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ఆశయాల స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

## కాంగ్రెస్ మండల కన్వీనర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి కి సన్మానం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల నూతన కన్వీనర్గా నియమితులైన ఏలేటి రాజశేఖర్ రెడ్డిని బుధవారం నేరడిగొండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల ముస్లిం మైనార్టీ సోదరులు ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపే తానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి సద్దాం, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొ న్నారు.

## బోథ్లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు కృషి చేయాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బోథ్ ప్రాంతంలో డయాలసిస్ కేంద్రం లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నూతన డయాలిసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలని రోగులు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోథ్, పరిసర ప్రాంతాల డయాలసిస్ రోగులు ప్రస్తుతం చికిత్స కోసం 50 కిలో మీటర్లోని నిర్మల్, 60 కిలో మీటర్లోని ఆదిలాబాద్ వరకు వెళ్లాల్సి వస్తోందని, వర్షాకాలంలో రోడ్లు సరిగ్గా లేకపోవడం, బస్సు సౌకర్యం కరువవడంతో వారానికి రెండు మూడు సార్లు ఈ దూర ప్రయాణం రోగులకు ప్రాణసంకటంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో బస్సులు అందుబాటులో లేక కొందరు ఆసుపత్రుల వద్దే పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. బోథ్ ఒక గిరిజన ప్రాంతం కావడంతో రవాణా సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని, ముఖ్యంగా గిరిజన రోగులు తీవ్ర ఆర్థిక, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొం టున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బోథ్లో ఆరోగ్యశ్రీ జాబితాలో డయాలసిస్ కేంద్రాన్ని చేర్చి, అత్యవసరంగా కొత్త కేంద్రాన్ని ప్రారంభించాలని, బోథ్లోని సీహెచ్సీ ఆసుపత్రి నూతన 50 పడకల భవన నిర్మాణం పూర్తయినందున, అక్కడే డయాలసిస్ సెంటర్ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

## కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి




**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** చిన్న కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రక్షణ సేన నేరడిగొండ మండల కన్వీనర్ బానోత్ వసంత్ రావు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం జారీ చేసిన ప్రొసీడింగ్స్ ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ భవనాలు, గురుకులాల నిర్మాణ పనులను చిన్న కాంట్రాక్టర్లు ఎంతో నిబద్ధతతో పూర్తి చేశారని, పనులు పూర్తై దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లులు చెల్లించకపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాకపోవడంతో వాటి కోసం ఎదురుచూస్తున్న అనేక మంది చిన్న కాంట్రాక్టర్లు అప్పులపాలై తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ తరహా పరిస్థితి నెలకొనడంతో కాంట్రాక్టర్ల కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి వచ్చిందని వాపోయారు. ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి పెండింగ్లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లు లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయిన చిన్న కాంట్రాక్టర్లను ఆదుకోవాలని కోరారు.

# మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యం దిశగా చర్యలు

### జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజంలో ఉన్నత స్థాయిలో నిలవాలని మహిళల ఆర్థిక స్వావలంబన కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్రే అనిల్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు నేడు వ్యాపార రంగంలో రాణిస్తూ ఆర్థికంగా ఎదిగి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కుట్టు మిషన్లు, ఎంబ్రాయిడరీ మిషన్ల ద్వారా తమ నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని, మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా జిల్లాలో సుమారు 80 వేల మంది విద్యార్థులకు 2 జతల ఏకరూప దుస్తులు కుట్టే కార్యక్రమాన్ని అప్పగించడం జరిగిందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ నిర్వహణ, రెబ్బెన మండలం నంబాల గ్రామంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు, బస్సుల కొనుగోలు ద్వారా ప్రతినెల ఒక్కొక్క బస్సుకు 70 వేల ఆదాయం, పెట్రోల్ బంకుల ఏర్పాటు పనులు చేపట్టడం ద్వారా మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించి చదివించాలని, ప్రభుత్వం విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలలో సభ్యులుగా చేరని వారిని గుర్తించి సభ్యులుగా చేర్పించి నూతన సంఘాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా మహిళా సంఘాల సభ్యులు సాధిస్తున్న విజయాలు, ఉత్పత్తులు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళా సంఘాలు అదనపు ఆదాయం పొందేలా వ్యాపార రంగాలలో రాణించాలని, ప్రభుత్వం మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ పథకాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, మండల సమాఖ్య సభ్యులు, ఎ పి ఎం లు, సి సి లు తదితరులు పాల్గొ న్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి - మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అంకుశపూర్ లో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం నిర్మించాలంటే మాదకద్రవ్యాల అలవాటుకు దూరంగా ఉండాలని తెలిపారు. మత్తు పదార్థాల రహిత



సమాజ నిర్మాణం మన అందరి బాధ్యత అని తెలిపారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వలన జరిగే నష్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, రాష్ట్రంలో నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు రాష్ట్ర గవర్నర్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులచే మత్తు పదార్థాల నివారణ పై ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకట్, ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు, సిబ్బంది, బ్రహ్మ కుమారీలు తదితరులు పాల్గొ న్నారు.

# గురుకులంలో ఘనంగా బోనాల వేడుకలు





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఆషాఢ మాసం పురస్కరించుకొని బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో ప్రత్యేకంగా సిద్ధం చేసిన బోనాలను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ప్రార్థనలు చేశారు.వేడుకల్లో విద్యార్థి నులు అమ్మవారి, పోతురాజు వేషధారణలో సందడి చేసి అందరినీ ఆకట్టుకున్నారు. సాంప్రదాయ నృత్యాలు, భక్తి గీతాలతో గురుకుల ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది బోనాల వేడుకలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఘనంగా 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు'

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా స్థానిక జనకాపూర్ (1, 2, 3, 4) అంగన్వాడీ కేంద్రాలలో అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి వారంలో నిర్వహించే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమేనని తెలిపారు. బిడ్డ పుట్టిన తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని, దీనివల్ల శిశువులకు రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఎదుగుతారని వివరించారు. అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లులకు కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు తమ సందేహాలను నివృత్తి చేసుకుంటూ, తమ పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ రేణుక, సూపర్వైజర్ పెంటు బాయ్, అంగన్వాడీ టీచర్లు అరుణ, ఇంద్ర, విజయలక్ష్మి, రాజమ్మ, దేవమ్మ, భాగ్యక్క తదితరులు పాల్గొ న్నారు.



# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ పెరుగుతున్న కొద్దీ అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా విస్తరిస్తున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ సైబర్ మోసాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ సూచించారు. ఆసిఫాబాద్ లోని ఏ రోజ్ గార్డె న్లో ప్రజలు, యువత కోసం ప్రత్యేకంగా నిర్వహించిన సైబర్ నేరాల నివారణ అవగాహన కార్యక్రమంలో హాజరై మాట్లాడుతూ ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. తెలియని వ్యక్తుల నుండి ఫోన్ కాల్స్ వస్తే వ్యక్తిగత వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని హెచ్చరించారు. అలాగే అపరిచితుల నంబర్ల నుండి వచ్చే సందేహాస్పద లింక్లను క్లిక్ చేయడం లేదా అనధికారిక యాప్లను డౌన్లోడ్ చేయడం వల్ల మొబైల్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఏ బ్యాంక్ అధికారి లేదా ఇతర సంస్థల పేరుతో ఫోన్ చేసి ఓటీపీ, ఏటీఎం పిన్ నంబర్లు, పాస్వర్డ్ లు అడిగినా ఎవరికీ చెప్పకూడదని స్పష్టం చేశారు. బ్యాంకు అధికారులు ఎప్పుడూ ఫోన్ ద్వారా ఇటువంటి రహస్య వివరాలను సేకరించరని గుర్తుచేశారు. ఒకవేళ ఎవరికైనా సైబర్ మోసాలు ఎదురైతే లేదా ఏవైనా అనుమానాస్పద ఘటనలు జరిగితే వెంటనే భయపడకుండా సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ నంబర్ 1930 కు కాల్ చేయాలని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ సీఐ నీలం రవి తదితరులు పాల్గొ న్నారు.

# పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో స్థానిక ఆదివాసీలకే 75% పోస్టులు కేటాయించాలి

- ఆదివాసీ యువతకు అన్యాయం చేయవద్దు
- తుడుందెబ్బ డిమాండ్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ లో రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగ ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, తక్షణమే నిబంధనల ప్రకారం 75% కేటాయింపులు వర్తింపజేసి న్యాయం చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ నీతిక పంత్ ని తుడుందెబ్బ ప్రతినిధుల బృందంతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 109, జీవో నెంబర్ 30 తెలంగాణ రాష్ట్ర పోలీస్ డిపార్ట్‌మెంట్ సర్వీస్ రూల్స్ గెజెట్ నోటిఫికేషన్ లలోని నిబంధనల ప్రకారం 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాలలో 75% ఉద్యోగాలను స్థానిక గిరిజనులకే కేటాయించాల్సి ఉందన్నారు. గతంలో 2015, 2018 2022 నోటిఫికేషన్లలో కూడా ఈ నిబంధనల ప్రకారమే అభ్యర్థులకు న్యాయం జరిగిందని గుర్తుచేశారు.అయితే ప్రస్తుత నోటిఫికేషన్‌లో జనరల్ జీవోల ప్రకారం పోస్టులను ఇవ్వడం వల్ల ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌ను పరిగణనలోకి తీసుకొని, జీవో నెంబర్ 24 ప్రకారం డీ ఎల్ ఎస్ సీ నిర్వహణ అనంతరం ఏజెన్సీ సర్టిఫికేట్ ఆధారంగా స్థానిక ఆదివాసీలతోనే ఈ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. గిరిజన అభ్యర్థుల సమస్యల తీవ్రతను గుర్తించి, ఈ వినతి పత్రాన్ని నివేదికను వెంటనే సంబంధిత పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆత్రం అర్జున్, రాయ్ సెంటర్ పెద్దలు ఆత్రం ఆనంద్ రావ్, కుంరం శ్యాంరావ్, తుడుందెబ్బ నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పక్కాగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 10న రేషనలైజేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేసి, 17న ముసాయిదా జాబితాను ప్రచురిస్తామన్నారు. 17 నుంచి సెప్టెంబరు 16 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్లను స్వీకరించి, అక్టోబర్ 19న తుది జాబితా విడుదల చేయనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్ఓ, బీఎల్ఏల సమావేశాలు నిర్వహించి, ఆ వివరాలను బీఎల్ఓ యాప్లో నమోదు చేయాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారమ్ల డిజిటైజేషన్ జిల్లా వ్యాప్తంగా 99.47 శాతానికి చేరిందని, ఇందులో ఆదిలాబాద్ నియోజకవర్గంలో 99.01 శాతం, బోథ్ పరిధిలో వంద శాతం పూర్తయిందని తెలిపారు. ఈ సందర్భంగా మరణించిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, నకిలీ ఓటర్ల వివరాలతో పాటు కేంద్రాల పునర్వ్యవస్థీకరణపై వివిధ పార్టీల నేతల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ జగదీశ్వరరావు, తహశీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# సామాజిక న్యాయ సంకల్ప సభను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పిలుపు




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్లో నిర్వహించనున్న "సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ"ను విజయవంతం చేయాలని బోథ్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రక్షణ సేన బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి రాథోడ్ బాపురావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సభకు సంబందించిన గోడ ప్రతులను పార్టీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధ్యక్షతన ఈ సభ జరగనుందని తెలిపారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం, ప్రజల హక్కుల పరిరక్షణ, సమాన అవకాశాల సాధన కోసం ఈ సంకల్ప సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, యువత, మహిళలు, రైతులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. తెలంగాణ సాధనలో సామాజిక న్యాయానికి ఉన్న ప్రాధాన్యతను ప్రజలకు వివరించడంతో పాటు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సభలో సమగ్రంగా చర్చిస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి వర్గానికి సమాన భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేన ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. బోథ్ నియోజకవర్గం నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

# బోరిగాం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**ఎంపీడీఓ జీవన్ రెడ్డి**

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బోరిగాం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎంపీడీఓ జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బోరిగాం గ్రామంలో పర్యటించి గ్రామంలోని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్పంచ్ రాథోడ్ వినేష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు తమ సమస్యలను ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో పెండింగ్లో ఉన్న సేవదాస్ నగర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే తల్లిదండ్రులను కోల్పోయిన జాదవ్ నితిన్ అనే అనాథ బాలుడికి ఇందిరమ్మ గృహం మంజూరు చేసే అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయం శిథిలావస్థలో ఉన్న భవనానికి మరమ్మతులు చేపట్టడం, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మనోహర్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్ కుమార్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మెరుగైన భవిష్యత్తు అందించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల వైద్య సేవలు అందిస్తూ వారిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం పట్టణంలోని డబ్ల్యూ కన్వేషన్ హాలులో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల అవగాహన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిత సెంటర్లలో ఏఐ సాంకేతికత, ప్రత్యేక టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఫిజియోథెరపిస్టులు, స్పీచ్ థెరపిస్టుల ద్వారా తగిన శిక్షణనిస్తున్నామని అన్నారు. శిక్షణలో విరామం రాకుండా తల్లిదండ్రులు రోజూ పిల్లలను సెంటర్లకు పంపాలని సూచించారు. గర్భధారణ సమయంలో 'టీఫా' స్కాన్ ద్వారా లోపాలను ముందే గుర్తించవచ్చని, జన్మించిన వెంటనే సమస్య ఉన్న పిల్లలను 'రిమ్స్' లోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ కి తీసుకెళ్లి వైద్యం అందిస్తే త్వరగా కోలుకుంటారని వివరించారు. దివ్యాంగ పిల్లలకు రవాణా, రీడింగ్, ఎస్కార్ట్ అలవెన్సులు, స్టైఫండ్ అందుతున్నాయని, అర్హులైన వారికి త్వరలోనే కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ యూడిఐడి కార్డ్, బెంచ్ మార్క్ డిసేబిలిటీ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల భవిష్యత్తుకు భరోసానిస్తూ, వారిని సమాజంలో ఉన్నత స్థాయికి తీసుకురావడం మనందరి సామాజిక బాధ్యత అని డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. పిల్లలను ఇళ్లకే పరిమితం చేయకుండా ముందుకు నడిపించాలని కోరారు. అనంతరం ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులను కలెక్టర్, కార్యదర్శి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మాధవి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, అధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఈనెల 9న అత్యంత వైభవంగా నిర్వహించాలని లఖంపూర్ గ్రామ రాయ్సెంటర్ సార్మేడి ఆత్రం గంగారాం పిలుపునిచ్చారు. నేరడిగొండ మండలంలోని కుమరం భీమ్ భవనంలో బుధవారం ఆదివాసి గ్రామాల పటేళ్ల సమక్షంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఆదివారం ప్రతి ఆదివాసి గ్రామంలో ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణ చేయాలన్నారు. 11.30 గంటలకు మండల కేంద్రంలోని కుమరం భీమ్ భవనంలో కూడా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల పటేళ్లు, దేవారి, మహాజనులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, మేధావులు, సర్పంచులు, తొమ్మిది తెగల కుల పెద్దలు, మండల అధ్యక్షులు హాజరై వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. ఆదివాసీల గొప్ప సంస్కృతి, సాంప్రదాయాలు చాటిచెప్పేలా పండుగను ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పలువురు పటేళ్లు, సర్పంచ్లు, తుడుందెబ్బ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



**ఉద్యమ కెరటం, తాండూర్:** విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పూర్వ విద్యార్థులు అన్నారు. తాండూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల 1995-96 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థి సురభి శరత్ కుమార్ జన్మదినం సందర్భంగా బుధవారం తాండూర్ కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినిలకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్, మాజీ ఎంపీపీ మాస సరిత వెంకటస్వామి, అడ్వకేట్ మద్దిబోయిన శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యుడు రెహేమాతుల్లా ఖాన్, డాక్టర్ జయచందర్, ఆవుల శ్రీనివాస్, రెవెల్లి శ్రీనివాస్, బండి మారుతి, లెంకతి మహేష్, కేజీబీవీ ఎస్ఓ కవిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మడేల్ అయ్యా గుడి షెడ్డు నిర్మాణానికి ఎలుక రామచందర్ చేయూత



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ పెద్ద చెరువు సమీపంలో రజకుల కులదైవమైన మడేల్ అయ్యా గుడి కోసం నిర్మించిన షెడ్డు ప్రారంభ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ బీఆర్ఎస్ నాయకులు ఎలుక రామచందర్ పాల్గొని ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రజకులు గుడి నిర్మాణానికి సహాయం చేయాలని కోరగా రేకులు, ఐరన్ పైపులు, సిమెంట్ పోల్స్ అందించి సుమారు రూ.8వేల వ్యయంతో షెడ్డు నిర్మాణానికి చేయూతనిచ్చినట్లు పేర్కొన్నారు. రజకుల కులదైవ ఆలయం అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాబు ఖాన్, చింటూ, రాచకొండ శ్రీనివాస్, దాగమ ప్రశాంత్, ఇప్ప రాజమల్లు, కొల్లూరి తిరుపతి, సారయ్యతో పాటు రజక సంఘం సభ్యులు, కుల పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# వ్యాక్సిన్ నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** వ్యాక్సిన్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వైసి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. చిన్నారులు, గర్భిణీలకు అందిస్తున్న టీకాల నిల్వలు, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యాక్సిన్ల భద్రత కోసం పాటిస్తున్న కోల్డ్ చైన్ నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టీకాల రికార్డుల నిర్వహణ విధానాన్ని అభినందిస్తూ, ఇదే విధంగా నాణ్యమైన సేవలు కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సద్దామ్, హెల్త్ సూపర్వైజర్లు బి.స్వర్ణలత, ఎ.సంతోష్, ఫార్మసిస్ట్ మీనా కుమారి, స్టాఫ్ నర్స్ సీతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్థి క ఇబ్బ ందులు విద్యకు అడ్డ ంకి కాకూడదు

## అజీమ్ ప్రేమ్జీ స్కాలర్షిప్పై విద్యార్థు లకు అవగాహన

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ఆర్థిక ఇబ్బందులు విద్యకు అడ్డంకి కాకూడదని అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ స్కాలర్షిప్పై స్వేరోస్ నాయకులు అన్నారు. కాగజ్నగర్ పట్టణంలోని పలు డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కాలర్షిప్కు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలు, దరఖాస్తు గడువు తదితర అంశాలను వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను కొనసాగించాలని స్వేరోస్ నాయకురాలు మమత సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఏ విద్యార్థిని విద్యకు దూరం చేయకూడదని అన్నారు. అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ అందిస్తున్న స్కాలర్షిప్కు అర్హులైన ప్రతి విద్యార్థిని దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ప్రక్రియలో అవసరమైన సహకారం అందించేందుకు స్వేరోస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు సురేష్, మాజీ కౌన్సిలర్ మీనాజ్, మహేందర్, సాయికృష్ణ, విద్యార్థు లు పాల్గొన్నారు.

# బిడ్డ పుట్టి న గంటలోపే ముర్రుపాలు ఇవ్వాలి





**ఉద్యమ కెరటం, హన్మకొండ:** బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని దామెర గ్రామ సర్పంచ్ గరిగె కల్పన కృష్ణమూర్తి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ దామెర సెక్టార్ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువుకు తల్లిపాలు తాగించడంతో పోషకాలు అందడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా చిన్నారులు వివిధ వ్యాధుల నుంచి రక్షణ పొందుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, హెల్త్ సూపర్వైజర్ ప్రేమలత, ఐసీడీఎస్ సూపర్వైజర్ ఛాయాదేవి, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు

## డ్రైవర్పై కేసు, వాహనం సీజ్



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ఓ ఆటోను పట్టుకున్నట్లు గుడిహత్నూర్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆటో డ్రైవర్పై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసు సిబ్బందితో కలిసి మన్నూరు—శాంతాపూర్ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి మధుకర్ అనే వ్యక్తి తన ఆటోలో పరిమితికి మించి 22 మంది ప్రయాణికులను ఎక్కించుకుని నిర్లక్ష్యంగా తరలిస్తున్నారు. దీంతో ఆటో డ్రైవర్పై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేయడం జరిగింది. ఆటో డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పేర్కొన్నారు.

# తల్లి పాలే శిశువులకు శ్రీరామరక్ష

## జిల్లా కలెక్ట ర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** నవజాత శిశువుల ఆరోగ్యం, శారీరక, మానసిక వికాసానికి తల్లిపాలు ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం రిమ్స్ ఆస్పత్రి నుంచి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టేడియంలో మెడికల్ కళాశాల విద్యార్థులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు నాటికలు, పాటల ద్వారా తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని స్పష్టం చేశారు. ముర్రుపాలలో ఉండే యాంటీబాడీలు శిశువుకు అవసరమైన రోగనిరోధక శక్తిని అందిస్తాయన్నారు. కొన్ని గిరిజన గ్రామాలు, తండాల్లో తల్లిపాలు సరిగ్గా రాకపోతే ఆవు పాలు, తేనె వంటివి పట్టిస్తున్నారని, దీంతో శిశువులకు ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. పాలు పడని సమయంలో తల్లిబిడ్డల చర్మానికి చర్మం తగిలేలా చేసే 'కంగారూ మదర్ కేర్'తో ప్రకృతి సిద్ధంగా తల్లిపాలు పడతాయని, రిమ్స్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. ఈ విషయంలో తల్లితో పాటు భర్త, అత్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. ఐసీఎంఆర్ 'సంకల్ప్' ప్రోగ్రామ్ ద్వారా నవజాత శిశు మరణాల రేటును తగ్గించగలిగామని, మెదడు వికాసానికి బిడ్డ పుట్టిన మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమని పేర్కొన్నారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా వైద్య కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ




పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సాధన, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు వెంకట్ రెడ్డి, అశోక్, వైద్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మూతపడిన ప్రభుత్వ బడికి మళ్లీ జీవం

- గ్రామస్తుల కృషితో ఆదర్శ పాఠశాల
- ఓబుల్ రావు బంజర బడి స్ఫూర్తిదాయకం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఒకప్పుడు విద్యార్థులు లేక జీరో ఎన్రోల్మెంట్తో మూతపడిన ప్రభుత్వ పాఠశాల నేడు చిన్నారుల కేరింతలతో కళకళ లాడుతోంది. గ్రామస్తుల సంకల్పం, ప్రజాప్రతినిధుల సహకారం, ఉపాధ్యాయుల అంకితభావం కలిస్తే ప్రభుత్వ పాఠశాల ఎలా ఆదర్శ విద్యాలయంగా మారుతుందో ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని ఓబుల్రావు బంజర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నిరూపిస్తోంది. 2023లో విద్యార్థు ల నమోదు పూర్తిగా లేకపోవడంతో ఈ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతపడింది. అయితే గ్రామంలో ప్రభుత్వ బడి కొనసాగాలని గ్రామస్తులు పట్టుదలతో ముందుకు రావడంతో పాటు, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ మాలోత్ నరసింహారావు, ఉపాధ్యాయుల ప్రత్యేక కృషి ఫలితంగా 2025లో పాఠశాల మళ్లీ ప్రారంభమైంది. పాఠశాల పునఃప్రారంభం తర్వాత విద్యార్థుల చేరికపై ప్రత్యేక దృష్టి సారించిన ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరిచారు. గ్రామస్తులు కూడా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి అండగా నిలవడంతో ప్రస్తుతం విద్యార్థు ల సంఖ్య క్రమంగా పెరిగి పాఠశాల సందడిగా మారింది. ప్రభుత్వ విద్యపై విశ్వాసం పెంపొందిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఓబుల్రావు బంజర పాఠశాల విజయగాథ ఆదర్శంగా నిలుస్తోందని గ్రామ పెద్దలు, విద్యా శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. జీరో ఎన్రోల్మెంట్తో మూతపడిన పాఠశాల నేడు విద్యార్థుల నవ్వులతో కళకళ లాడటం గ్రామానికి గర్వకారణంగా మారింది.

# తల్లిపాలు శిశువు సంపూర్ణ ఆరోగ్యానికి వరం

- మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణ రెడ్డి

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** తల్లిపాలే శిశువు సంపూర్ణ ఆరోగ్యానికి తొలి వరం అని మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణ రెడ్డి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం ఖమ్మం జిల్లా కల్లూరు మండల పరిధిలోని కల్లూరు మున్సిపాలిటీ రైతు వేదికలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్పర్సన్ నీరజ, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నిర్మలజ్యోతిలతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు అత్యుత్తమమైన ఆహారమని, అనేక వ్యాధుల నుంచి రక్షించే శక్తి వాటిలో ఉంటుందని తెలిపారు. పుట్టిన బిడ్డ కు వీలైనంత త్వరగా తల్లిపాలు పట్టించడం ద్వారా ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు బాటలు పడతాయని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్పర్సన్ నీరజ, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నిర్మల జ్యోతిలు మాట్లాడుతూ తల్లిపాల కంటే విలువైన ఆహారం మరొకటి లేదని, వాటిలోని సమృద్ధి పోషకాలు శిశువు సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలని, పరిశుభ్రతను తప్పని సరిగా పాటించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ఆరోగ్యలక్ష్మి పౌష్టికాహారం, ఐరన్ మాత్రలను గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు,



పెనుబల్లి, తల్లాడ మండలాల ఏసీడీపీఓలు రత్నమ్మ, పద్మావతి, మెహరూన్నిసా బేగం, సునీత, సూపర్వైజర్లు, పీహెచ్ఎన్ సులోచన, అంగన్వాడీ టీచర్లు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# ఈనెల 10న జైల్ భరోను జయప్రదం చేయాలి

**ఉద్యమ కెరటం, తాండూర్:** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగాం రాజారాం పిలుపునిచ్చారు.
బుధవారం తాండూర్ మండల కేంద్రంలోని భగత్సింగ్ భవన్లో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను




వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ జరిగే జైల్ భరో కార్యక్రమంలో జిల్లాలోని కార్మికులు, వ్యవసాయ కార్మికులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో సీసీఓ ప్రశాంత్ కుమార్కు జైల్ భరో కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం తాండూర్ మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్, నాయకులు బొల్లం రాజేశం, దుర్గం శంకర్, కోళ్ల విజయలక్ష్మి, మహంకాళి విజయలక్ష్మి, సరిత, అరవింద, రెడ్డి మల్లక్క, హనుమక్క, వరలక్ష్మి, జైనేని లక్ష్మి, దుర్గం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వర్షా ల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

## ఏఈఓ రాజేంద్ర నేత

**ఉద్యమ కెరటం, జైనూర్:** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పత్తి పంటలో నీరు నిలిచి మొక్కలు దెబ్బతినే ప్రమాదం ఉందని, రైతులు వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జైనూర్ మండల వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రాజేంద్ర నేత సూచించారు. బుధవారం జంగావ్ క్లస్టర్లో పలు గ్రామాలను సందర్శించి పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పొలాల్లో ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే వెంటనే కాలువల ద్వారా బయటకు పంపించి పంటను నీటి ముంపు నుంచి కాపాడాలని సూచించారు. వర్షాలు తగ్గి పొలం ఆరిన వెంటనే గొర్రు గుంటకతో దుక్కి చేసి నేలలో గాలి ప్రసరణ పెరిగేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వేరుకుళ్లు వంటి తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. వర్షాలతో పత్తి ఆకులు పసుపు రంగులోకి మారే అవకాశం ఉందని, ఆకుమచ్చ తెగులు, వేరుకుళ్లు, రసం పీల్చే పురుగుల ఉధృతి కూడా పెరిగే అవకాశముందని సూచించారు. నివారణ చర్యల్లో భాగంగా లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్, లేనియెడల 1 గ్రాము కార్బండజిమ్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే కాపర్ ఆక్సిక్లోరైడ్ను మొక్కల మొదళ్ల వద్ద తడిసేలా పిచికారీ చేస్తే వేరుకుళ్లను సమర్థవంతంగా నియ ంత్రించ వ చ ్చన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గి నేలలో తగిన తేమ ఉన్న తర్వాతే తగిన మోతాదులో ఎరువులు వేయాలని వివరించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.



# ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి




**ఉద్యమ కెరటం, హన్మకొండ:** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. భారత మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ఎంసీపీఐ(యు) హన్మకొండ జిల్లా సర్వసభ్య సమావేశం బుధవారం సింగారం గ్రామంలో పెద్ది రెడ్డి మహేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైటెక్ హంగులతో అభివృద్ధి చెందుతున్న హన్మకొండ నగరంలోనూ మధ్యతరగతి కాలనీలు, పేదల బస్తీలు అనేక మౌలిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. వర్షాకాలంలో హన్మకొండ సముద్రాన్ని తలపించే పరిస్థితులు నెలకొంటున్నా, ఇళ్ల స్థలాల సమస్య, డ్రైనేజీ, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రజా ఉద్యమాలు బలహీన పడటమే సమస్యలు పరిష్కారం కాకపోవడానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రజా సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలు, ప్రజారోగ్య అంశాలపై ఎంసీపీఐ(యు) భవిష్యత్తులో ఉద్యమాలు చేపడుతుందన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. దేశ సంపదను కొద్ది మంది కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ పేదరికాన్ని పెంచుతోందని, మతోన్మాద, మనువాద రాజకీయాలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కూడా పార్టీ ఉద్యమాలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వల్లేపు ఉపేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎన్.హంసారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, కర్ర రాజిరెడ్డి, మలోతు రాజేష్ నాయక్, జిల్లా కార్యదరి ్శవర్గ సభ్యులు చీపురు ఓదయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎండి. ఉస్మాన్, కుసం బుచ్చయ్య, వక్కల కిషన్, మంద భద్రయ్య, బలుగురి రాజేశ్వరరావు, బలుగురి ప్రభాకర్రావు, కునూరి వెంకటేశ్వరరావు, అన్నబోయిన ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# పీజీ సెట్లో రైతు బిడ్డ కు రాష్ట్రంలో 4వ ర్యాంక్



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్ మండలంలోని కొత్త సార్సాల గ్రామానికి చెందిన రైతు దంపతులు కందుల పోచయ్య– సుశీల కుమారుడు కందుల రాజన్న పీజీ సెట్ లో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీజెడ్సీఎస్ లో డిగ్రీ పూర్తి చేసిన రాజన్న, తాజాగా విడుదలైన పీజీ సెట్ ఫలితాల్లో ఎంఎస్సీ బోటనీ విభాగంలో రాష్ట్రంలో నాలుగో ర్యాంకు సాధించాడు. రైతు కుటుంబానికి చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించడం పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ రాజన్నను అభినందించారు. గ్రామీణ ప్రాంతం నుంచి కృషి, పట్టుదలతో ఉన్నత విజయాన్ని సాధించిన రాజన్న మరెందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడని కొనియాడారు.

# ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదమైంది

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**



**ఉద్యమ కెరటం, జైనూర్:** ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదమైందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జైనూర్ మండలంలో మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయునిగా సేవలందించిన మెస్రం మనోహర్ ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 30 సంవత్సరాలకు పైగా ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన మెస్రం మనోహర్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. విద్యార్థుల పట్ల ఆయన చూపిన అంకితభావం, క్రమశిక్షణ, సేవా దృక్పథం నేటి యువ ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాసిమెట్ట కాంప్లెక్స్ హెచ్ఎం అనిత, ప్రధాన్ పురోహిత్ రాష్ట్ర అధ్యక్షుడు, బీడీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్, రాజ్ గోండు సేవాసమితి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనక దేవేందర్, జైనూర్ సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలా, తొడసం ధర్మరావు, టీడబ్ల్యూటీయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోట్నాక్ భీంరావు, సర్పంచులు కొడప ప్రకాష్, శేషు నారాయణ, జాదవ్ శ్రావణ్, నాగోరావ్, మాజీ సర్పంచులు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తల్లి పాల వారోత్సవాలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ సెక్టార్లోని రేచిని 5వ అంగన్వాడి కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ స్వరూప రాణి తల్లిపాల ప్రాముఖ్యత గురించి తల్లులకు వివరించారు. అలాగే ముర్రుపాల ప్రాముఖ్యతను, బిడ్డకు కలిగే లాభాలను, బిడ్డకు తల్లి ముర్రుపాలు ఇవ్వడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం పిల్లల బరువులు, ఎత్తులను చూశారు. ఈ కార్యక్రమంలో రేచిని గ్రామ సర్పంచ్ పోతరాజుల రాంబాయి, ఉప సర్పంచ్ కొలిపాక భీమయ్య, వార్డు సభ్యులు కేశెట్టి శ్రీనివాస్, వైద్యులు శైలజ, ఎన్ ఎల్ హెచ్ పి సౌజన్య, ఆశాలు సుమలత, శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు పద్మ, రజిత, లక్ష్మి,తల్లులు

# అప్రమత్తతోనే సైబర్ మోసాలకు అడ్డు కట్ట





**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** అప్రమత్తత, అవగాహనతోనే సైబర్ మోసాలకు అడ్డుకట్ట ఎస్సై సర్తాజ్ పాషా అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో బుధవారం పోలీసులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సైబర్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకులు, కేవైసీ, లోన్ పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెలియని యాప్లు డౌన్లోడ్ చేయడం, వ్యక్తిగత సమాచారం ఇతరులతో పంచుకోవడం ద్వారా భారీ నష్టాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అనంతరం తహశీల్దార్ మోహన్రావు, ఎంపీడీఓ బండారు ప్రవీణ్ కుమార్ లు మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యోగులతో పాటు రైతులు కూడా సైబర్ మోసాలకు గురవుతున్నారని, రైతు భరోసా, రుణమాఫీ పేరుతో వచ్చే నకిలీ సందేశాలను నమ్మవద్దని సూచించారు. ఎంఈఓ సునీతలు మాట్లాడుతూ తాను కూడా గతంలో సైబర్ మోసగాళ్ల బారిన పడిన అనుభవాన్ని వివరించారు. చిన్నపాటి అజాగ్రత్త కూడా పెద్ద నష్టానికి దారితీస్తుందని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల దుస్థితిపై స్పందన...ట్రాఫిక్ సమస్యలకు పరిష్కార దిశగా ఎమ్మెల్యే

- సమస్యల మధ్య పాదయాత్ర...పరిష్కారాలపై స్పాట్ ఆదేశాలు
- సీఆర్ఎంపీ రోడ్డు , భూగర్భ డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలపై అధికారులకు స్పష్ట మైన ఆదేశాలు

**ఉద్యమ కెరటం,కుత్బుల్లా పూర్:**
వేగంగా విస్తరిస్తున్న బౌరంపేట ప్రాంతంలో పెరుగుతున్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బుధవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పాదయాత్ర నిర్వహించారు. అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని సంబంధిత అధికారులకు తక్షణ చర్యల ఆదేశాలు జారీ చేశారు.పాదయాత్ర సందర్భంగా స్థానికులు డీపీఎస్ స్కూల్–బౌర్రాయి సీఆర్ఎంపీ ప్రధాన రహదారి దెబ్బతినడం, భారీ వాహనాల రద్దీతో ప్రమాదకర పరిస్థితులు నెలకొనడం, భూగర్భ డ్రైనేజీ సమస్యలు, అంతర్గత రహదారుల దుస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో ఫోన్లో మాట్లాడి సీఆర్ఎంపీ రహదారి అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. భారీ వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ట్రాఫిక్ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీటిని ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లి ంచి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయాలని, వేగంగా విస్తరిస్తున్న కాలనీలకు అవసరమైన తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ పాదయాత్రలో డిప్యూటీ కమిషనర్ వెంకట మణికిరణ్, ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈ పాపమ్మ, ఏఈ సురేందర్ నాయక్, డీజీఎం ప్రమీలా, ఏఈ వెంకటేష్, విద్యుత్ శాఖ ఏఈ సాయి కిరణ్, పోలీసు అధికారులు, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి , మాజీ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు..

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

**రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం చెన్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్తో కలిసి కోటపల్లి, చెన్నూర్, భీమారం, జైపూర్ మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతిఒక్కరికి అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో వివిధ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అమృత్ 2.0 పథకం కింద చెన్నూర్ నియోజకవర్గంలో సుమారు రూ.వంద కోట్ల వ్యయంతో నీటి ట్యాంకులు, పైప్లైన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే సోలార్ ఆధారిత సెంట్రల్ లైటింగ్ వ్యవస్థలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, నీటి ట్యాంకులు, విద్యుత్ స్తంభాలు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇళ్లు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు. మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్యుత్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణ శాఖల పనుల పురోగతిని సమీక్షించారు. గుత్తేదారుల పనితీరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పుష్కర ఘాట్ల నిర్మాణం, అంతర్గత రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ప్రజా సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# మహిళల భద్రత పోలీసుల బాధ్యత...

**ఉద్యమ కెరటం,తూప్రాన్:**
వ్యభిచార వృత్తిని వీడి గౌరవప్రదమైన జీవనం సాగించేలా మహిళలకు అండగా నిలిచి, వారిని జనజీవన స్రవంతిలో కలిపేందుకు పోలీస్ శాఖ దృఢ సంకల్పంతో పనిచేస్తోందని డీఎస్పీ నరేందర్ గౌడ్ తెలిపారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సరోజినీనగర్ వద్ద జాతీయ రహదారి పక్కన కొంతమంది మహిళలు వ్యభిచార వృత్తిలో కొనసాగుతున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు వారం రోజుల క్రితం అక్కడ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 16 మందిని గుర్తించి, వారిని షెల్టర్ హోమ్‌కు తరలించారు. అనంతరం వారిని వ్యభిచార వృత్తి నుంచి బయటకు తీసుకువచ్చి, గౌరవప్రదమైన జీవనం సాగించేలా పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వారికి ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వాటికి అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. DRDA, RDOతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని మహిళలకు అందించాల్సిన శిక్షణ, స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

## అనధికారిక లీగ్‌లో ఆడిన పాక్ మాజీ క్రికెటర్లకు షాక్

# రెండేళ్ల నిషేధానికి పీసీబీ సిద్ధం



- ఐసీసీ గుర్తింపు లేని టోర్నీలో పాల్గొనడంపై క్రమశిక్షణ చర్యలు

**లాహోర్, ఆగస్టు 5:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిబంధనలను ఉల్లంఘించి అనధికారిక క్రికెట్ లీగ్‌లో పాల్గొన్న పలువురు మాజీ ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఐసీసీ లేదా జాంబియా క్రికెట్ యూనియన్ గుర్తింపు లేని టోర్నీలో ఆడినందుకు మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఇర్ఫాన్‌తో పాటు పలువురు మాజీ క్రికెటర్లపై రెండేళ్ల నిషేధం విధించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. జాంబియా రాజధాని లుసాకాలో ఇటీవల నిర్వహించిన 'ఏషియన్ లెజెండ్స్ లీగ్'కు ఐసీసీ గుర్తింపు లేదని, జాంబియా క్రికెట్ యూనియన్ కూడా ఈ టోర్నీకి మద్దతు ఇవ్వలేదని పీసీబీ పేర్కొంది. బోర్డు నుంచి ముందస్తు అనుమతి (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) తీసుకోకుండా ఈ లీగ్‌లో పాల్గొనడం నిబంధనల ఉల్లంఘనేనని స్పష్టం చేసింది. ఈ నిషేధం అమల్లోకి వస్తే సంబంధిత ఆటగాళు రెండేళ్లపాటు ఎలాంటి క్రికెట్ కార్యకలాపాల్లోనూ పాల్గొనలేరు. ఆటగాళ్లుగా మాత్రమే కాకుండా పీసీబీ లేదా పాకిస్తాన్ సూపర్ లీగ్ పరిధిలోని జట్లకు కోచ్, మెంటార్ లేదా సలహాదారులుగా కూడా వ్యవహరించలేని పరిస్థితి ఏర్పడుతుంది. క్రికెట్ సమగ్రతను కాపాడడం, ఐసీసీ నిబంధనలను అమలు చేయడం లక్ష్యంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పీసీబీ తెలిపింది. టోర్నీలో 'పాకిస్తాన్ పాంథర్స్'తో పాటు మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయి. లీగ్ కోసం మహమ్మద్ హఫీజ్, సోహైల్ తన్వీర్, ఉమర్ అక్మల్ లుసాకా చేరుకున్నప్పటికీ, టోర్నీకి ఐసీసీ ఆమోదం లేదని తెలుసుకున్న తర్వాత చివరి నిమిషంలో వైదొలిగారు. అయితే మహమ్మద్ ఇర్ఫాన్, ఇమ్రాన్ నజీర్, తౌఫీక్ ఉమర్, రాహత్ అలీ, యాసిర్ షా, జాహిద్ మహమూద్, హసన్ రజా, ఇబ్రార్ హుస్సేన్ తదితరులు జూలై 31న జరిగిన మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఈ టోర్నీలో భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్‌కు చెందిన జట్లు కూడా బరిలోకి దిగినప్పటికీ, ఇప్పటివరకు తమ ఆటగాళ్లపై బహిరంగంగా క్రమశిక్షణ చర్యలు ప్రకటించిన ఏకైక బోర్డుగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిలిచింది.



## కావ్య మారన్ జట్టులోకి

# మిచెల్ మార్ష్

**ఎస్ఏ20 ఛాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌తో ఒప్పందం**

**రిషాద్ హుస్సేన్‌కూ చోటు.. మరో టైటిల్‌పై గురి**

**కేప్‌టౌన్, ఆగస్టు 5:** దక్షిణాఫ్రికా టీ20 లీగ్ (ఎస్ఏ20) ప్రస్తుత ఛాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ మరో కీలక ఆటగాడిని జట్టులోకి తీసుకుంది. సన్ గ్రూప్ సహ యజమాని కావ్య మారన్ ఆధ్వర్యంలోని ఈ ఫ్రాంచైజీ ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో రానున్న సీజన్‌లో జట్టు మరింత బలపడింది. మార్ష్‌కు ఎస్ఏ20లో ఆడటం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇటీవల ముగిసిన ఐపీఎల్--2026లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున మిచెల్ మార్ష్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. 13 మ్యాచ్‌ల్లో 563 పరుగులు సాధించి జట్టులో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అతని దూకుడైన బ్యాటింగ్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌ను ఆకట్టుకోవడంతో అతడిని జట్టులోకి తీసుకుంది. మార్ష్ చేరికతో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ బ్యాటింగ్ విభాగం మరింత పటిష్టమైంది. ఇప్పటికే జట్టులో క్వింటన్ డి కాక్, ట్రిస్టన్ స్టబ్స్, మార్కో జాన్సెన్, ఆన్రిచ్ నార్జే, ఆడమ్ మిల్నే వంటి స్టార్ ఆటగాళ్లు ఉండగా, ఇప్పుడు మార్ష్ రావడంతో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకం మరింత పెరిగింది. మిచెల్ మార్ష్‌తో పాటు బంగ్లాదేశ్ లెగ్ స్పిన్నర్ రిషాద్ హుస్సేన్‌ను కూడా ఫ్రాంచైజీ జట్టులోకి చేర్చుకుంది. 2024 టీ20 ప్రపంచకప్‌లో 14 వికెట్లు తీసి ఆకట్టుకున్న రిషాద్, ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ ఏఎం ఘజన్‌ఫర్ స్థానాన్ని భర్తీ చేయనున్నాడు. ఎస్ఏ20 చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టుగా సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ నిలిచింది. ఇప్పటివరకు జరిగిన నాలుగు సీజన్లలో మూడు టైటిళ్లు గెలిచి తన ఆధిపత్యాన్ని చాటుకున్న ఈ జట్టు, మరోసారి ట్రోఫీపై కన్నేసింది. ఎస్ఏ20 కొత్త సీజన్ వచ్చే ఏడాది జనవరి 17 నుంచి ప్రారంభం కానుండగా, అక్టోబర్ 7న మినీ వేలం నిర్వహించనున్నారు. ఇప్పటికే ట్రిస్టన్ స్టబ్స్‌ను కెప్టెన్‌గా కొనసాగించిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టులో వేలం ద్వారా భర్తీ చేయాల్సిన స్థానాలు కేవలం రెండే మిగిలి ఉండటంతో మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

## బీసీసీఐ సమీక్షా సమావేశం వాయిదా

**కార్యదర్శి అస్వస్థతతో ఫ్యూచర్ ప్లాన్ ఆలస్యం**

**త్వరలో గంభీర్‌తో కీలక భేటీ.. జట్టు ప్రదర్శనపై సమీక్ష**

**ముంబై, ఆగస్టు 5:** ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో భారత జట్టు వరుస పరాజయాలపై నిర్వహించాల్సిన బీసీసీఐ సమీక్షా సమావేశం వాయిదా పడింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అస్వస్థతకు గురికావడంతో ఈ సమావేశం ఆలస్యమైనట్లు సమాచారం. త్వరలోనే ఈ భేటీ నిర్వహించనుండగా, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వర్చువల్ విధానంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్‌గా కోల్పోయిన టీమిండియా, అనంతరం ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోనూ 3--2తో ఓటమి చవిచూసింది. ఆ తర్వాత జరిగిన వన్డే సిరీస్‌లో కూడా పరాజయం ఎదురవడంతో జట్టు ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆటలోని లోపాలను విశ్లేషించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు బీసీసీఐ సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇంగ్లాండ్ పర్యటన జూలై 19తో ముగిసినప్పటికీ, ప్రస్తుతం భారత జట్టు శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్టుల సిరీస్ కోసం సిద్ధమవుతోంది. అయినప్పటికీ ఇప్పటివరకు సమీక్షా సమావేశం జరగకపోవడం చర్చనీయాంశమైంది. టీ20 ప్రపంచకప్ విజేత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌కు బాధ్యతలు అప్పగించిన తర్వాత భారత్ వరుస సిరీస్‌లు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ఇంగ్లాండ్‌తో మూడో టీ20లో 202 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేవలం 76 పరుగులకే ఆలౌటై 125 పరుగుల భారీ తేడాతో ఓడిపోవడం, నాలుగో మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో పరాజయం పాలవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇక అంతకుముందు ఐర్లాండ్‌తో 2--0 తేడాతో సిరీస్ కోల్పోవడం భారత క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద షాకుల్లో ఒకటిగా నిలిచింది. అయితే ఈ పరాజయాలపై స్పందించిన బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఇది తాత్కాలిక ప్రతికూల దశ మాత్రమేనని, అంతర్జాతీయ క్రికెట్‌లో ఇలాంటి హెచ్చుతగ్గులు సహజమని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న సమీక్షా సమావేశంలో జట్టు ప్రదర్శన, భవిష్యత్తు ప్రణాళికలు, ఎంపికల విధానం, జట్టు బలోపేతంపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.





## ఫుట్‌బాల్ మ్యాచ్‌లో

# పిడుగు బీభత్సం

**మైదానంలోనే 24 ఏళ్ల ఆటగాడు మృతి**

**మరో 12 మంది క్రీడాకారులకు గాయాలు**

**బ్యాంకాక్, ఆగస్టు 5:** థాయిలాండ్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో మైదానంలో పిడుగు పడటంతో విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 24 ఏళ్ల యువ ఫుట్‌బాలర్ సోఫ్వాన్ అవాయే మృతి చెందగా, మరో 12 మంది ఆటగాళ్లు గాయపడ్డారు. ఈ సంఘటన థాయిలాండ్‌లోని సుంగై గోలోక్‌లోని శాంతిపాప్ స్టేడియంలో నిర్వహిస్తున్న 'గోలోక్ ఎఫ్ఏ కప్' టోర్నీలో చోటుచేసుకుంది. సామ్ కోల్ట్స్, అబు ఎక్స్ నాంగ్ సిరిన్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పిడుగు మైదానంపై పడింది. దీంతో సామ్ కోల్ట్స్ జట్టుకు చెందిన వింగర్ సోఫ్వాన్ అవాయే తీవ్రంగా గాయపడి మైదానంలోనే కుప్పకూలాడు. వెంటనే సహచర ఆటగాళ్లు అతనికి సీపీఆర్ అందిస్తూ ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అనంతరం అత్యవసర వైద్య సిబ్బంది ఆసుపత్రికి తరలించినప్పటికీ చికిత్స ఫలించక అతడు మృతి చెందినట్లు పోలీసులు ధృవీకరించారు. ఈ ప్రమాదంలో గాయపడిన 12 మంది ఆటగాళ్లలో ఒక మలేషియా ఫుట్‌బాలర్ కూడా ఉన్నట్లు స్థానిక పోలీస్ చీఫ్ థున్ సిరిఖుంట్ తెలిపారు. గాయపడిన వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. మరణించిన సోఫ్వాన్ అవాయే ఇటీవలే థాయ్ థర్డ్ డివిజన్ క్లబ్ 'యాలా ఎఫ్‌సీ'తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అతని ఆకస్మిక మృతిపై యాలా ఎఫ్‌సీ యాజమాన్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. థాయిలాండ్‌లో పిడుగుపాటు ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. అక్కడి డిసీజ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ గణాంకాల ప్రకారం 2020 నుంచి 2024 మధ్య దేశవ్యాప్తంగా 283 మంది పిడుగుపాటుకు గురయ్యారు. వారిలో అధిక సంఖ్యలో బాధితులు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు.



## విజేతలకు ఢిల్లీలో

# ఘన స్వాగతం

**కామన్వెల్త్ పతక విజేతలకు అభిమానుల ఘన సన్మానం**

**జూడో స్వర్ణ విజేత అస్మితకు ప్రత్యేక ఆదరణ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** కామన్వెల్త్ గేమ్స్-2026లో భారతదేశానికి పతకాల పంట పండించి స్వదేశానికి చేరుకున్న క్రీడాకారులకు ఢిల్లీలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న భారత బృందాన్ని వందలాది మంది అభిమానులు హర్షధ్వానాలతో ఆహ్వానించారు. ఏడు స్వర్ణ పతకాలు సాధించిన భారత బాక్సింగ్ జట్టుతో పాటు జూడోలో దేశానికి చారిత్రాత్మక స్వర్ణ పతకం అందించిన అస్మితకు అభిమానులు ప్రత్యేకంగా సన్మానం చేశారు. పూలమాలలతో పాటు రూ.50 నోట్లతో తయారుచేసిన దండలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అస్మిత తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. జూడోలో భారత్‌కు స్వర్ణ పతకం సాధించాలనేది తన చిరకాల కల అని, గ్లాస్గోకు బయలుదేరినప్పటి నుంచే స్వర్ణంతోనే స్వదేశానికి తిరిగి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపింది. ఆ లక్ష్యాన్ని సాధించడం జీవితంలో మరపురాని ఘట్టమని పేర్కొంది. భారత క్రీడాకారుల విజయాలతో దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. విమానాశ్రయంలో అభిమానులు, కుటుంబ సభ్యులు, క్రీడా సంఘాల ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలుకుతూ విజేతలను అభినందించారు.

# ధుల్ ధాటికి సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ ఘన విజయం



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ఢిల్లీ ప్రీమియర్ లీగ్-2026లో సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ ఓపెనర్ యష్ ధుల్ అద్భుత శతకంతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. అరుణ్ జైట్లీ స్టేడియంలో పురానీ ఢిల్లీ-6తో జరిగిన మ్యాచ్‌లో 23 ఏళ్ల ధుల్ కేవలం 47 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 100 పరుగులు సాధించాడు. డీపీఎల్‌లో అతనికి ఇది రెండో సెంచరీ. ఈ అద్భుత ఇన్నింగ్స్‌కు గాను 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. వర్షం కారణంగా 15 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పురానీ ఢిల్లీ-6 జట్టు 7 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ బౌలర్ మనీ గ్రేవాల్ మూడు వికెట్లు తీసి ప్రత్యర్థి టాప్ ఆర్డర్‌ను కుదేలు చేశాడు. ఒక దశలో 55 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన పురానీ ఢిల్లీని రోహన్ రాఠీ (46), అశ్విని చిల్లా (38) ఆరో వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకున్నారు. 141 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ 13.2 ఓవర్లలోనే ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. యష్ ధుల్ దూకుడైన బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. నాలుగో ఓవర్‌లో 23 పరుగులు, ఐదో ఓవర్‌లో మరో 23 పరుగులు రాబట్టి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 22 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన ధుల్, అనంతరం అదే జోరు కొనసాగించి శతకాన్ని అందుకున్నాడు. సిద్ధార్థ్ అవుటైన తర్వాత యుగళ్ సైనితో కలిసి రెండో వికెట్‌కు అజేయంగా 81 పరుగులు జోడించాడు. చివరకు దిగ్వేష్ రాఠీ బౌలింగ్‌లో సింగిల్ తీసి శతకంతో పాటు జట్టు విజయాన్ని కూడా ఖాయం చేశాడు. ఈ విజయంతో సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ గెలిచి పూర్తి ఆధిపత్యంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.




# విడుదలకు సిద్ధమవుతున్న కొరియన్ కనకరాజు

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఇండో–కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా చూసిన వారి ఒపీనియన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా కామెడీ, వరుణ్ తేజ్ నటన, థమన్ సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని టాక్ వినిపిస్తోంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన కామెడీ చిత్రాలను తెరకెక్కించిన మేర్లపాక గాంధీ, మరోసారి తన మార్క్ కామెడీని ఈ చిత్రంలో చూపించినట్లు సమాచారం. సినిమా తొలి భాగం నుంచి రెండో భాగం వరకు పలు కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సెన్సార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్లు బాగా వర్కవుట్ అయ్యాయని అంటున్నారు. అలాగే వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే కామెడీ ట్రాక్‌తో పాటు బుల్లిరాజు పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు కూడా మంచి వినోదాన్ని అందిస్తాయని సమాచారం. సినిమాలో వరుణ్ తేజ్ రెండు విభిన్న కోణాలు ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన సాధారణ యువకుడు కనకరాజు పాత్రలో ఒకవైపు కనిపిస్తే, మరోవైపు కొరియన్ గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన తర్వాత పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో కనిపించనున్నారని టాక్. ఈ రెండు పాత్రల మధ్య బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, స్టైల్ పరంగా వరుణ్ తేజ్ మంచి వేరియేషన్ చూపించారని సినిమా చూసిన వారు చెబుతున్నారు. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే వరుణ్ తేజ్ ఈసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో కూడా తన నటనతో ఆకట్టుకున్నారని సమాచారం. సినిమా కథ ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో రూపొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా కంపెనీలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ కనిపించనుంది. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని మలుపు తిరుగుతుంది. కొరియా నుంచి వచ్చిన ఓ బాటిల్‌లో బంధించబడిన గ్యాంగ్‌స్టర్ ఆత్మ బయటకు వచ్చి కనకరాజును ఆవహిస్తుంది. ఆ తర్వాత కనకరాజు జీవితం ఎలా మారింది? ఆ ఆత్మ కొరియాతో ఉన్న సంబంధం ఏమిటి? చివరకు కథ ఎలాంటి మలుపు తిరిగింది? అనే అంశాల చుట్టూనే సినిమా సాగుతుందని తెలుస్తోంది. సినిమాకు సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు కథకు మరింత బలం చేకూర్చాయని సమాచారం. కామెడీ తర్వాత ఎక్కువ ప్రశంసలు సంగీతానికే వస్తాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

# ఆసిఫాబాద్ కాంగ్రెస్‌లో ముదిరిన విభేదాలు




## డీసీసీ అధ్యక్షురాలిపై అధిష్టానానికి ఫిర్యాదు

## గాంధీ భవన్ ఎదుట కాంగ్రెస్ నాయకుల ధర్నా

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ శైలిపై, పార్టీ నియమావళికి విరుద్ధంగా నియామకాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ జిల్లాలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలు బుధవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ హైదరాబాద్ లోని గాంధీభవన్ వద్ద ధర్నా చేపట్టారు. స్థానిక పరిస్థితులను విస్మరించి "నాన్–లోకల్" (స్థానికేతర) నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల జిల్లాలో పార్టీ తీవ్రంగా నష్టపోతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేస్తున్న సీనియర్ నాయకులను, పాత కార్యకర్తలను విస్మరించి, ఇటీవల ఇతర పార్టీల నుండి వచ్చిన వారికే పదవుల్లో దాదాపు 95 శాతం ప్రాధాన్యత ఇచ్చారని నాయకులు ఆరోపించారు. పార్టీ ప్రయోజనాల కంటే ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తూ, ప్రశ్నించిన వారిని బెదిరించడం కేసులు పెడతామని హెచ్చరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అంతేకాకుండా, డిసిసి నాయకత్వంలో సరైన సమన్వయం లేకపోవడం వల్ల సర్పంచ్ ఎన్నికల్లో తీవ్ర విఫలమవ్వడమే కాకుండా, చేతికి రావలసిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఛైర్మన్ పీఠాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ కమిటీలు, బిఎల్ఏ నియామకాలు, ఎస్సీ, మైనారిటీ సెల్ ఛైర్మన్ పదవుల్లో కూడా బిఆర్ఎస్, బీజేపీ నేపథ్యం ఉన్న వ్యక్తులకు ప్రాధాన్యం కట్టబెట్టారని వారు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఎస్సీ, ఎస్టీ, బిసి , మైనారిటీ వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించకుండా సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. పార్టీకి దీర్ఘకాలిక నష్టం జరగకుండా కాపాడాలంటే ఆత్రం సుగుణ వ్యవహార శైలిపై అధిష్టానం వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వర్గ రాజకీయాలకు స్వస్తి చెప్పి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీని వెంటనే రద్దు చేసి పునర్వ్యవస్థీకరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానికతకు, అంకితభావంతో పనిచేసే సీనియర్ కార్యకర్తలకు తగిన గౌరవం, ప్రాధాన్యత ఇచ్చి పార్టీని బలోపేతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ కార్తీక్, మాజీ ఏఎంసి ఛైర్మన్ మునీర్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు షిండే దత్తు, మహేష్ గౌడ్, అసద్, చరణ్ , నిజాం, సుదర్శన్ గౌడ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్యారడైజ్‌తో పోటీ పడనున్న దోరతి మూవీ




న్యాచురల్ స్టార్ నాని హీరోగా, కయాదు లోహర్ హీరోయిన్‌గా మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, సరిగ్గా అదే తేదీన నానితో పోటీ పడేందుకు ఆయన 'దసరా' సహనటి కీర్తి సురేష్ సిద్ధమవుతుండటం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న 'డోరతి' చిత్రంలో కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. సంగీత మాంత్రికుడు ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ రిలీజ్ డేట్‌ను తమిళ వెర్షన్ కోసం లాక్ చేసినప్పటికీ, తెలుగులోనూ ఇదే తేదీకి వస్తే బాక్సాఫీస్ వద్ద నాని సినిమాతో కీర్తి సురేష్ నేరుగా పోటీ పడాల్సి వస్తుంది. మంచి స్నేహితులుగా ఉన్న నాని, కీర్తి సురేష్‌ల చిత్రాలు ఒకే తేదీన బరిలో నిలుస్తుండటంతో ఈ బాక్సాఫీస్ క్లాష్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరికి ఈ సినిమాల విడుదల తేదీల్లో మార్పులు ఉంటాయా లేదా అనేదానిపై త్వరలోనే క్లారిటీ రానుంది.

# సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల




యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో కూడిన ఎమోషనల్ సాగా కూడా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను కూడా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల చాప్టర్ 1' : 2027 జూలై 2, 'కరికాల చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషం. ఇప్పటివరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు. అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో నటిస్తున్నారు. అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**